క్లుప్తంగా

## మానకొండూర్‌లో సీఎం కప్ పోటీలు

మానకొండూర్‌రూరల్: మండల కేంద్రంలో 15, 16, 17వ తేదీల్లో నిర్వహించే సీఎం కప్ పోటీల్లో మండలంలోని క్రీడాకారులు పాల్గొనాలని, 13వ తేదీ వరకు గ్రామ పంచాయతి కార్యదర్శులకు టీం పేర్లు అందజేయాలని ఎంపీడీవో ప్రకటనలో తెలిపారు. ప్రతిభ కనపరిచిన క్రీడాకారులను జిల్లాస్థాయికి ఎంపికచేయడం, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్, రన్నింగ్, లాంగ్‌జంప్, హైజంప్ క్రీడలు ఉంటాయని, క్రీడాకారులు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు.

## జీపీ కార్మికుల డిమాండ్లు పరిష్కరించాలి


మాట్లాడుతున్న గడ్డం నాగరాజు

మానకొండూర్‌రూరల్: గ్రామ పంచాయతీ కార్మికుల డిమాండ్లు తక్షణమే పరిష్కరించాలని బీజేపీ మానకొండూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి గడ్డం నాగరాజు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట కార్మికులు నిర్వహిస్తున్న సమ్మెకు మంగళవారం మద్దతు తెలిపారు. చాలీ చాలని జీతాలతో బతుకీడుస్తున్న కార్మికులకు బీజేపీ అండగా ఉంటుందన్నారు. అనంతరం ఎంపీడీవోకు డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ప్రవీణ్, నాయకులు అజయ్‌వర్మ, లక్ష్మణాచారి, కత్తి ప్రభాకర్, ప్రదీప్, గణేష్,అనిల్, సంపత్ పాల్గొన్నారు.

## మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ


మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న జగదీశ్వర్

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని రాంపూర్‌లో ఉపాధి హామీ కూలీలకు సోమవారం గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ నిర్వాహకుడు గంగిశెట్టి జగదీశ్వర్ మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ చిమ్ముల రాజేందర్, ఫీల్డ్ అసిస్టెంట్ పుష్పలత, తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీడీవోగా భాస్కర్‌రావు

రామడుగు/గంగాధర: రామడుగు ఎంపీడీవో రాజీవ్ మల్హోత్రా గంగాధర మండలానికి బదిలీ కాగా గంగాధర మండల ఎంపీడీవో భాస్కర్‌రావును రామడుగు మండలానికి బదిలీ చేస్తూ జిల్లా అధికారులు మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు.

## కంటి వెలుగు శిబిరం ప్రారంభం


కళ్లద్దాలు అందిస్తున్న శ్రీనివాస్, రాధిక

హుజూరాబాద్: మున్సిపాలిటీ పరిధి కొత్తపల్లిలోని 13వ వార్డులో ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలలో కంటి వెలుగు శిబిరాన్ని మంగళవారం ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, మున్సిపల్ చైర్ పర్సన్ గండె రాధిక ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సాల్వాది సమ్మయ్య, వార్డు కౌన్సిలర్ కొండ్ర జీవిత, నాయకులు కొలిపాక శ్రీనివాస్, తోట రాజేంద్ర ప్రసాద్, ముక్క రమేష్, కొండ నరేష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## ధాన్యం ట్రాక్టర్ బోల్తా



శంకరపట్నం: మండలంలోని వంకాయగూడెంలో మంగళవారం ధాన్యం ట్రాక్టర్ బోల్తాపడింది. ఆముదాపల్లి నుంచి మానకొండూర్‌కు ధాన్యం లోడుతో వెళ్తున్న ట్రాక్టర్ వెనుక టైర్ పంక్చర్ కావడంతో ట్రాలీతో ట్రాలీ బోల్తాపడింది.

# ఎప్పుడు పూర్తయ్యేనో..!

- సా...గుతున్న 'చెక్‌డ్యాం' నిర్మాణాలు
- ఏళ్లు గడుస్తున్నా పూర్తికాని పనులు


హుజూరాబాద్‌లోని బతుకమ్మ సొల్ల వద్ద అసంపూర్తిగా చెక్‌డ్యాం పనులు

హుజూరాబాద్: భూగర్భ జలాల పెంపు కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'చెక్‌డ్యాం'ల నిర్మాణాలు హుజూరాబాద్ నియోజకవర్గంలో నత్తనడకన సా...గుతున్నాయి. నియోజకవర్గంలోని ఆయా మండలాలకు 13 చెక్‌డ్యాంలు మంజూరుకాగా, మూడేళ్ల క్రితం పనులు చేపట్టారు. ఏళ్లు గడుస్తునా ఒక్కటి కూడా పూర్తి కాలేదు. ఈ వానాకాలం ప్రారంభంలోపు పూర్తి చేయాలనే ఉద్దేశంతో అధికారులు కసరత్తు చేస్తున్నారు. గతంలో నియోజకవర్గంలో పది చెక్‌డ్యాంలు పూర్తిచేయడంతో జలకళ సంతరించుకున్నాయి. దీంతో వ్యవసాయబావులు, బోరుబావుల్లో నీటి ఊటలు పెరగటంతో సాగునీటి ఇబ్బందులు తొలిగాయి. కొత్తగా చేపట్టిన మరో 13 చెక్‌డ్యాంలు పూర్తయితే నియోజకవర్గం వాటర్ హబ్‌గా మారనుంది.

### వాగులు, వంకల వద్ద నిర్మాణం

హుజూరాబాద్ మండలంలో రాంపూర్, కనుకులగిద్ద, జూపాకలో చెక్‌డ్యాంలు నిర్మించాలని సంకల్పించారు. జూపాక, కనుకులగిద్ద చెక్‌డ్యాంలు సాంకేతిక కారణాలతో రద్దు అయిందని అధికారులు పేర్కొన్నారు. జమ్మికుంట మండలంలో మడిపల్లి, తనుగుల మానేరు, ఇల్లందకుట మండలం వాగొడ్డు రామన్నపల్లి, సమ్మక్క -సారక్క జాతర జరిగే సమీపంలో, పాతర్లపల్లి, మల్యాలలో, వీణవంక మండలం బ్రాహ్మణపల్లిలోని కల్వల వాగు, పోతిరెడ్డిపల్లి కల్వలవాగు, మానేరు వద్ద వీటిని చెక్‌డ్యాంలు నిర్మిస్తున్నారు. పనులు ప్రారంభమై ఏళ్లు గడుస్తున్నా పూర్తి చేయడం లేదు.

### తీరనున్న సాగునీటి కష్టాలు

ఇప్పటికే కాళేశ్వరంతో ఎప్పుడూ లేనంతగా ఈసారి ఎస్సారెస్పీ ద్వారా నిరంతరం సాగునీరు విడుదల చేస్తుండటంతో వాగులు, వంకలు జలకళను సంతరించుకున్నాయి. ఇప్పటికే నియోజకవర్గంలో పది చెక్‌డ్యాంలు నిర్మించగా ఆయా ప్రాంతాల్లో నీటి నిల్వలు పెరిగాయి. కొత్తగా చేపట్టిన చెక్‌డ్యాంల నిర్మాణాలు వానాకాలంలోపు పూర్తయితే నియోజకవర్గం వాటర్‌హబ్‌గా మారునుంది. రైతులకు సాగునీటి కష్టాలు తొలుగుతాయి.

### నిర్మాణాలు ఇలా...

ఇల్లందకుంట మండలం రామన్నపల్లి, మల్యాల, పాతర్లపల్లి, మెట్‌పల్లి, జమ్మికుంట మండలం మడిపల్లిలో చెక్‌డ్యాం నిర్మాణాలకు రూ. 6.455 కోట్లు మంజూరుకాగా పనులు దాదాపు 85 శాతం, హనుమకొండ జిల్లా కమలాపూర్ మండలం శనిగరం, నేరెళ్లలో రూ.9.465 కోట్లతో చేపట్టిన పనులు 90 శాతం, ఇదే మండలం గూడూరు శనిగరంలో చేపట్టిన పనులు 94 శాతం పూర్తయ్యాయి. హుజూరాబాద్ పట్టణ సమీపంలోని బతుకమ్మ సొల్ల వద్ద నిర్మిస్తున్న చెక్ డ్యాం పనులు ఏళ్లు గడుస్తున్నా పూర్తి కావడం లేదు.

### వానాకాలంలోపు పూర్తికి చర్యలు



హుజూరాబాద్ డివిజన్‌లో చెక్‌డ్యాంల పనులు వానాకాలం ప్రారంభంలోపు పూర్తి చేయాలనే లక్ష్యంతో చర్యలు చేపట్టాం. గడువులోపు పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్లకు చెప్పాం, నోటీసులు కూడా ఇచ్చాం. వానాకాలంలోపు పూర్తికి చర్యలు తీసుకుంటాం.
– శశిభూషణ్, ఈఈ, హుజూరాబాద్

అయితే నియోజకవర్గంలో చేపట్టిన అన్ని చెక్‌డ్యాం పనులు పూర్తికి అవసరమైన నిధుల కోసం అధికారులు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ప్రభుత్వం నుంచి అనుమతులు రావాల్సి ఉంది.

# కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ


చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రసమయి

గన్నేరువరం: రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. మండలంలోని మాదాపూర్ గ్రామంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం ప్రారంభించారు. మైలారం, హన్మాజీపల్లి, గన్నేరువరం గ్రామాల్లో కల్యాణ లక్ష్మి చెక్కులు పంపిణీ చేశారు. మొక్కజొన్న రైతులను ఆదుకోవడానికి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామని, రైతులు దళాలను ఆశ్రయించకుండా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించి ప్రభుత్వ మద్దతు ధర పొందాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాడుగుల రవీందర్ రెడ్డి, ఆర్‌ఎస్‌ఎస్ జిల్లా, మండల కోఆర్డినేటర్లు గూడెల్లి తిరుపతి, బద్దం తిరుపతిరెడ్డి, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు గంప వెంకన్న, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

# బీఎస్పీ నాయకుల సంబరాలు


మాట్లాడుతున్న నిషాని రామచంద్రం


స్వీట్లు పంపిణీ చేస్తున్న బీఎస్పీ నాయకులు

మానకొండూర్: బీఎస్పీ భరోసా యాత్రలో రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను జాతీయ అధ్యక్షురాలు బహెన్‌జీ మాయావతి ముఖ్యమంత్రి అభ్యర్థిగా ప్రకటించడం పట్ల రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మానకొండూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి నిషాని రామచంద్రం హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా మంగళవారం మండల కేంద్రంలోని చౌరస్తా వద్ద బాణాసంచా కాలుస్తూ, స్వీట్లు పంచుతూ సంబురాలు జరుపుకున్నారు. దళితుడిని ముఖ్యమంత్రి చేసేది పార్టీ బీఎస్పీ అని రుజువైందన్నారు. ఈకార్యక్రమంలో మాతంగి ఎల్లయ్య, వాసాల భాను, భాస్కర్, సంపత్, వినోద్, అనిల్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జమ్మికుంట: బీఎస్పీ అధికారంలోకి వచ్చేందుకు బీసీ, ఎస్సీ, ఎస్టీ నాయకులు కృషి చేయాలని పార్టీ హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి మారపల్లి మొగిలయ్య పిలుపునిచ్చారు. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను సీఎం అభ్యర్థిగా బీఎస్పీ అధినేత్రి మాయావతి ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. అనంతరం మంగళవారం పట్టణంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీలు అమలు చేయడంలేదన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి దొడ్డె సమ్మయ్య, జిల్లా కార్యదర్శి ఈదునూరి రమేష్, మండల అధ్యక్షుడు రాచపల్లి రమేష్,నాయకులు దాసారపు మహేందర్, మడిపల్లి అశోక్ పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధే ధ్యేయం

## ఎమ్మెల్యే సుంకె రవిశంకర్


రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రవిశంకర్

రామడుగు: గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. మండలంలోని వెలిచాల గ్రామంలో మంగళవారం సూడా నిధులు రూ.55 లక్షలతో సీసీరోడ్డు పనులను ప్రారంభించారు. గ్రామాలలో రహదారులు, కమ్యూనిటీహాల్స్, మిషన్ భగీరథ, కాకతీయ వంటి పనులను చేపట్టడం జరిగిందన్నారు. కార్యక్రమంలో సూడా చైర్మన్ జీవీ రామక్రిష్ణారావు, లైబ్రరీ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్‌గౌడ్, సర్పంచ్ వీర్ల సరోజనప్రభాకర్‌రావు, రామడుగు సింగిల్ విండో చైర్మన్ వీర్ల వెంకటేశ్వర్‌రావు, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు శుక్రుద్దీన్, పార్టీ మండల అధ్యక్షుడు గంట్ల జితేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ మామిడి తిరుపతి, రైతుబంధు కమిటీ మండల కోఆర్డినేటర్ జూపాక కరుణాకర్, నాయకులు కలిగేటి లక్ష్మణ్, వీర్ల రవీందర్ రావు, తదితరులు పాల్గొన్నారు.

### పథకాల అమలులో దేశానికే ఆదర్శం

గంగాధర: సంక్షేమ పథకాల అమలులో తెలంగాణ దేశానికే ఆదర్శంగా నిలుస్తోందని ఎమ్మెల్యేఅన్నారు. మండలంలోని ఆచంపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడి ఇంటికి వెళ్లి కల్యాణలక్ష్మి చెక్కు అందజేశారు. అన్నివర్గాల అభివృద్ధి కోసం ప్రభుత్వం పనిచేస్తుందని, పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేస్తుందన్నారు. మండలంలోని గంగాధర వ్యవసాయ మార్కెట్ నుంచి కొండన్నపల్లి వరకు రూ. 2.60 కోట్లతో పునఃనిర్మించనున్న రోడ్డు పనులకు, ఆచంపల్లి గ్రామం నుంచి బోయినిపల్లి మండలంలోని విలాసాగర్ వరకు రూ.2.76 కోట్లతో నిర్మించనున్న రోడ్డు పనులకు ఎమ్మెల్యే భూమిపూజ చేశారు.

# గాలివాన బీభత్సం

- కొట్టుకుపోయిన రేకుల షెడ్లు
- తడిసి ముద్దయిన ధాన్యం
- నేలకొరిగిన వృక్షాలు, కరెంట్ స్తంభాలు


సైదాపూర్: రాయికల్‌లో కొట్టుకుపోయిన రేకుల ఇల్లు పైకప్పు


కుమ్మరించిన వడగండ్లు


మందాడిపల్లి గ్రామంలో జాతీయ రహదారిపై నేలకొరిగిన వృక్షాలు

సైదాపూర్: మండలంలో మంగళవారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. మండల కేంద్రంతో పాటు రాయికల్, బొమ్మకల్ తదితర గ్రామాల్లో గాలివానలకు రేకులషెడ్ల పైకప్పులు లేచిపోయాయి. ఇళ్లలోని సామాను వర్షాలకు ధ్వంసమైంది. చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. ధాన్యం కుప్పలు తడిసిపోవడంతో రైతులకు అపార నష్టం కలిగింది.

హుజూరాబాద్: అకాల వర్షాలు ప్రజలను ఆగం చేస్తుండగా... మంగళవారం మండల వ్యాప్తంగా అకాల వర్షానికి ఆయా గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి ముద్దయింది. సింగాపూర్, సిర్సపల్లి, కందుగుల, ధర్మరాజుపల్లి, రంగాపూర్, రాంపూర్ గ్రామాల్లో రోడ్లపై ఆరబోసిన ధాన్యం కొట్టుకుపోవడంతో రైతులు బోరుమని విలపించారు. మున్సిపాలిటీ పరిధి బోర్నపల్లిలో కొండపర్తి రాజేందర్ ఇంటి పైకప్పు కప్పు లేచిపోవడంతో ఇంట్లోని వస్తువులు ధ్వంసమయ్యాయి. శాలపల్లి ఇందిరానగర్ గ్రామంలో గీసా స్వామి ఇల్లు వర్షానికి దెబ్బతింది. భారీ ఈదురుగాలుల మూలంగా హుజూరాబాద్ మండలంలోని మందాడిపల్లి గ్రామంలో కరీంనగర్-వరంగల్ ప్రధాన రహదారిపై భారీ వృక్షాలు నేలకొరగడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది.

# మరమ్మతు పనులు ప్రారంభం


తుమ్మల చెరువు కట్టుకాలువ పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సతీశ్‌కుమార్

సైదాపూర్: రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అన్నివర్గాల అభివృద్ధికి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే వొడితల సతీశ్‌కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని వెన్కెపల్లి తుమ్మల చెరువు కట్టు కాలువ మరమ్మతు పనులు, వెన్కెపల్లి సహకార సంఘం ఆధ్వర్యంలో వెన్కెపల్లి ఈర్ల బండ వద్ద నిర్వహిస్తున్న మక్కల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కల్యాణలక్ష్మి, సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. నిరుపేదలకు సంక్షేమ పథకాలు ఉపయోగపడుతున్నాయని పేర్కొన్నారు. ఐకేపీ భవనం ఫ్లోరింగ్ ధ్వంసమైందని సిబ్బంది ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా కార్యాలయాన్ని పరిశీలించి మరమ్మతు చేయిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ ప్రభాకర్‌రెడ్డి, సింగిల్ విండోల చైర్మన్లు తిరుపతిరెడ్డి, వెంకటరెడ్డి, తహసీల్దార్ బావ్‌సింగ్, ఎంపీడీవో పద్మావతి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

## స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం పర్యటన


కనుకులగిద్దె గ్రామంలో పరిసరాలను పరిశీలిస్తున్న బృందం సభ్యులు

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని కనుకులగిద్దె, చిన్నపాపయ్యపల్లి గ్రామాల్లో మంగళవారం స్వచ్ఛ సర్వేక్షణ్ బృందం పర్యటించింది. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా స్వచ్ఛ సర్వేక్షణ్ అమలు చేస్తుందన్నారు. ఈ సందర్భంగా రహదారుల పరిశుభ్రత, మురుగుకాలువల నిర్వహణ తీరును పరిశీలించారు. వర్షపు నీరు వృథా కాకుండా ఇళ్ల ఆవరణలో నిర్మించుకున్న ఇంకుడుగుంతలను పరిశీలించారు. అలాగే గ్రామ పంచాయతీలకు సంబంధించిన సెగ్రిగేషన్ షెడ్లను తనిఖీ చేసి వర్మి కంపోస్టును పరిశీలించారు. అలాగే తడి, పొడి చెత్త వేరుచేసే విధానంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. వెంట ఎంపీడీవో విజయలక్ష్మీ, సర్పంచులు, యూనిసెఫ్ ప్రాజెక్ట్ బృందం సభ్యులు తదితరులు ఉన్నారు.

## సుందరగిరిలో శ్రీవేంకటేశ్వరస్వామి రథోత్సవం



చిగురుమామిడి: చిగురుమామిడి మండలం సుందరగిరి గ్రామంలో మంగళవారం శ్రీ వేంకటేశ్వరస్వామి రథోత్సవం వైభవంగా సాగింది. ఆలయంలో వేకువజాము నుంచే భక్తుల సందడి నెలకొంది. స్వామివారి ఉత్సవ విగ్రహాలను రథంపై గ్రామవీధుల్లో ఊరేగించారు. మహిళల కోలాట నృత్యాలు ఆకట్టుకున్నాయి. సర్పంచ్ శ్రీమూర్తి రమేష్, ఎంపీటీసీ మెదబోయిన తిరుపతి, ఉప సర్పంచ్ జంగా శ్రీనివాస్‌రెడ్డి, ఈవో రాజకుమార్, ఆలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ గందె సంపత్, డైరెక్టర్లు గుండెకారి మాధవ్, తాళ్లపెల్లి కిరణ్‌కుమార్‌గౌడ్, బొల్లబత్తిని మహేష్, మంథని మహేష్, వెంకటలక్ష్మి, కవిత తదితరులున్నారు.

## రుణాలు సక్రమంగా చెల్లించాలి

చిగురుమామిడి: గ్రామైక్య సంఘాల మహిళలు ప్రభుత్వం నుంచి తీసుకున్న రుణాలు సక్రమంగా చెల్లించాలని శిక్షణ కలెక్టర్ వాత్సల్య లెనిన్ అన్నారు. మంగళవారం చిగురుమామిడిలోని ఐకేపీ కార్యాలయంలో గ్రామసంఘాల మహిళలతో ఆర్థిక లావాదేవీలు, పొదుపు నిర్వహణపై సమీక్ష నిర్వహించారు. బ్యాంకుల నుంచి తీసుకున్న రుణాలను ప్రతినెల 5వ లోపు చెల్లిస్తే ప్రభుత్వం నుంచి పావలా వడ్డీ వర్తిస్తుందన్నారు. అనంతరం ట్రైనీకలెక్టర్‌ను మహిళా సంఘాల బాధ్యులు సన్మానించారు. డీఆర్‌డీఏ అదనపు పీడీ వెంకటేశ్వర్లు, చిగురుమామిడి ఎంపీపీ కొత్త వినీత, జెడ్పీటీసీ గీకురు రవీందర్, ఏపీఎం సంపత్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ కవితకు క్షమాపణ చెప్పాలి

హుజూరాబాద్: లిక్కర్ స్కాంలో కోర్టు ఇచ్చిన తీర్పు బీజేపీ నాయకులకు చెంపపెట్టు అని ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్ అన్నారు. బీజేపీ నాయకులు ఎమ్మెల్సీ కవితకు క్షమాపణ చెప్పాలని, లేదంటే గ్రామాల్లో తిరగనివ్వబోమన్నారు. మంగళవారం పట్టణంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వ మెప్పుకోసం ఎమ్మెల్సీ కవితపై ఈడీ, సీబీఐ సంస్థలు తప్పుడు కేసులు నమోదు చేసి, సీఎం కేసీఆర్ కుటుంబాన్ని ఇబ్బందులకు గురిచేశాయని ఆరోపించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు కొలిపాక శ్రీనివాస్, నాయకులు వర్దిని రవీందర్‌రావు, పుల్లేని సత్యనారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

## బైండోవర్ ఉల్లంఘించిన వ్యక్తికి జరిమానా

తిమ్మాపూర్: బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించిన వ్యక్తికి రూ.లక్ష జరిమానా విధించినట్లు ఎల్ఎండీ ఎస్సై ప్రమోద్‌రెడ్డి తెలిపారు. మండలంలోని రామకృష్ణ కాలనీకి చెందిన గంధం జంపయ్య అదే గ్రామానికి చెందిన ఓ యువతితో అసభ్యంగా ప్రవర్తించాడు. దీనిపై ఎల్ఎండీ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. జంపయ్యను పోలీసులు తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేశారు. అయితే అతను బైండోవర్ నిబంధనలు ఉల్లంఘించి, ఇటీవల తన అత్తమ్మ క్లోం కనకవ్వను కొట్టి, గాయపర్చాడు. బాధితురాలు ఫిర్యాదు చేయడంతో పోలీసులు అతన్ని మంగళవారం తహసీల్దార్ ఎదుట హాజరుపర్చారు. బైండోవర్ ఉల్లంఘించినందుకు తహసీల్దార్ రూ.లక్ష జరిమానా విధించారని ఎస్సై పేర్కొన్నారు.

ఆధ్యాత్మికం

## వైభవంగా హనుమాన్ శోభాయాత్ర


రామడుగు: శోభాయాత్ర నిర్వహిస్తున్న హనుమాన్ స్వాములు


శంకరపట్నం: లింగాపూర్‌లో...


మానకొండూర్: కొండపలకలలో...

రామడుగు: మండలంలోని రాంచంద్రాపూర్ గ్రామంలో మంగళవారం హనుమాన్ మాలధారులు శోభాయాత్ర కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాహనంలో హనుమాన్ విగ్రహాన్ని గ్రామంలోని ప్రధాన వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చాడ ప్రభాకర్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

శంకరపట్నం: మండలంలోని లింగాపూర్ గ్రామంలో హనుమాన్ శోభాయాత్ర నిర్వహించారు. మహిళలు మంగళహారతులతో తరలివచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. శోభాయాత్రలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, మెట్‌పల్లి విండో చైర్మన్ సంజీవరెడ్డి, తహసీల్దార్ శ్రీనివాస్‌రావు, ఎంపీటీసీ లతారాజిరెడ్డి, మాలధారణ భక్తులు పాల్గొన్నారు.

మనకొండూర్: మండలంలోని కొండపలకల గ్రామంలో హనుమాన్ శోభాయాత్ర కన్నుల పండుగగా నిర్వహించారు. గ్రామంలోని ప్రధాన వీధుల్లో ఊరేగిస్తూ భక్తి పాటలు ఆలపించారు. కార్యక్రమంలో పూజారి రఘురామాచార్యులు అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.